క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, ట్రీ ట్రిమ్మింగ్ నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని నిజాంపేట్ సబ్‌స్టేషన్ ఏఈ రాకేష్ ఓ ప్రకటనలో తెలియజేశారు.

- బృందావన్ హిల్స్ ఫీడర్ పరిధిలోని ప్రశాంతి హిల్స్ కాలనీ, బృందావన్‌హిల్స్ కాలనీ, మధురానగర్ ఫేజ్–3 ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.
- జర్నలిస్ట్ కాలనీ ఫీడర్ పరిధిలోని బండారు లేవుట్ రోడ్డు నం.4బీ, 5బీ, 5సీ, 6బీ, 6సీ, 7బీ, 7సీ, 8బీ, 8సీ, 9(2,3,4), 10, జర్నలిస్టు కాలనీలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- బాచుపల్లి సబ్‌స్టేషన్ మల్లంపేట్ ఫీడర్ పరిధిలోని రెయిన్‌బో కాలనీ, ప్రణీత్‌జనీత్, సిల్వర్ ఓక్స్ స్కూల్ వెనుక వీధి ప్రాంతంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..
- అదే విధంగా మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేఆర్‌సీఆర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

పంచవటి ఫీడర్ పరిధిలో...

నిజాంపేట్: పంచవటి ఫీడర్ పరిధిలోని శ్రీకృష్ణ గార్డెన్, గోదావరికట్స్, సాయి విలేజ్, సాయి కీర్తి ఎన్‌క్లేవ్, టీవీఎస్ షోరూమ్, గోశాల డిటీఆర్, శ్రీమంకీస్ చౌరస్తా, ప్రగతి పాఠశాల, ఎన్టీఆర్ పార్క్, బచ్‌పన్ స్కూల్, మధురానగర్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రగతినగర్ ఏఈ సమ్మయ్య తెలిపారు.

రాకపోకలకు ఆటంకం.. విద్యుత్ స్తంభం

జగద్గిరిగుట్ట: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వాహనదారులకు ఆటంకంగా మారుతోంది. పాపిరెడ్డినగర్ బాక్–బీలోని రోడ్డు నం.10లో 15రోజుల క్రితం శిథిలమైన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త వాటిని అమర్చారు. ఇంత వరకు బాగానే ఉంది. కాని పాత స్తంభాన్ని తరలించకుండా అక్కడే వదిలేయడంతో రాకపోకలకు ఆటంకంగా మారుతోంది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే స్తంభాన్ని తరలించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

పారా సైలింగ్



నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి పాఠశాలలో ఆదివారం పారా సైలింగ్ ఈవెంట్ నిర్వహించారు. కౌశిక్ ఏరో స్పోర్ట్స్ ఆధ్వర్యంలో పాఠశాల గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 300 మంది విద్యార్థులు పాల్గొని 40 ఫీట్ల ఎత్తులో పారా సైలింగ్ చేశారు. ఏరోస్పోర్ట్స్ స్క్వాడ్రన్ లీడర్ కౌశిక్ హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పారా సైలింగ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పారా సైలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికేట్లు అందజేశారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని చెరబండ రాజునగర్, నవజీవన్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బాబాసాహెబ్ డాక్టర్ భీంరావు అంబేడ్కర్ విగ్రహాలను ఆదివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, స్థానికులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

నివాళి



కుత్బుల్లాపూర్: అనారోగ్యంతో మృతి చెందిన నందమూరి తారకరత్న భౌతికకాయానికి ఆదివారం మేడ్చల్ జిల్లా వైఎస్సార్‌టీపీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి నివాళులర్పించారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కూకట్‌పల్లి: ఓల్డ్ బోయినపల్లి బీఆర్ఎస్ పార్టీ నాయకులు 20మంది ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మొయిజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి గొట్టిముక్కల వెంగళరావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నజీర్, ఖాజా, ఫిరోజ్, మొజిన్, ముజాఫ్ఫార్, నయీమ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ నేతకు ఊహించిన గౌరవం

వరుస పదవులు ఇచ్చి అధినేత ప్రోత్సాహం

దాదాపు రెండు దశాబ్దాల క్రితం... హైదరాబాద్ నగర శివారు ప్రాంతం అది. గులాబీ జెండా పట్టుకున్న వాళ్లను వింతగా చూస్తున్న రోజులు అవి. జై తెలంగాణ అని నినదించిన వాళ్లను జాలిగా చూసిన కాలమది. అలాంటి గడ్డు కాలంలో ఉన్న ఊరిని ఇంటి పేరుగా చేసుకొని నూనూగు మీసాలతో ఓ నవ యువకుడు టీఆర్ఎస్ జెండాను ఎత్తి పట్టుకున్నాడు. తమ ఉద్యమ నాయకుడైన కేసీఆర్‌పై ఉన్న అచంచలమైన విశ్వాసం. స్వరాష్ట్ర కాంక్ష కోసం దృఢమైన సంకల్పం ఆ యువకుడిని ఎత్తిన జెండాను దించకుండా పోరుబాటే మార్గంగా ముందుకు నడిపించింది. ఒక్కడిగా ప్రారంభమై వేలాదిగా దండును కదిలించి ఉద్యమ నేతగా ఈ ప్రాంతంలో వాసికెక్కిన ఆ యువకుడు మరెవరో కాదు.. సుంకరి రాజు అలియాస్ శంభీపూర్ రాజు.



మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 14 ఏళ్ల పాటు జరిగిన మలిదశ ఉద్యమ ప్రస్థానంలో తనకంటూ ఒక పేజీని లిఖించుకున్న శంభీపూర్ రాజు జీవితం పూలబాట ఏమి కాదు.. తనకున్న కొద్దిపాటి పొలాన్ని సైతం ఉద్యమ సమయంలో ఖర్చు చేసి ఉద్యమాన్ని బతికించుకున్న వాళ్లలో రాజు ఒకరిగా చెప్పవచ్చు. ఆ సమయంలో ఉద్యమ నేత కేసీఆర్‌కి అండదండగా ఉంటూ ఈ ప్రాంతంలో పార్టీకి జీవం పోసిన పాలబుగ్గలు యువకుడు రాజు అనడంలో సందేహం లేదు.

తెలంగాణ కోసం ఆస్తులను సైతం అమ్ముకుని..

పార్టీ ఏ కార్యక్రమానికి పిలిచినా దానిని విజయవంతం చేయడానికి శతవిధాల ప్రయత్నించి సఫలం అయ్యేవాడు. వంటా వార్పు, సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్, సాగరహారం ఇలా ఒకటేమిటి ప్రతి సందర్భంలోనూ ఈ ప్రాంతం నుంచి ఆయన పాత్ర అజరామరం... అనిర్వచనీయం. వస్తుందో రాదో తెలియని తెలంగాణ కోసం ఆస్తులను సైతం అమ్ముకొని పోరాడిన వ్యక్తిగా శంభీపూర్ రాజుది ప్రత్యేక స్థానం.



ప్రభుత్వ విప్‌గా నియమితులైన తరుణంలో సీఎం కేసీఆర్‌కు పూలమొక్క అందజేస్తూ..

కడుపులో పెట్టుకుంటానని మాటిచ్చి..

అంతిమంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించడం.. ఇలాంటి వ్యక్తుల కల సాకారం అవడం చకచకా జరిగిపోయాయి. ఇదే సందర్భంలో కష్టించి పనిచేసిన వాళ్లను కడుపులో పెట్టుకుంటాను అని కేసీఆర్ అన్న మాటను రాజు లాంటి వ్యక్తులకు పదవులు ఇచ్చి నూటికి నూరుపాళ్ల నిజం చేశారు. మొదట పార్టీ పదవులు... తదనంతరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటాలో రంగారెడ్డి జిల్లా శాసనమండలి సభ్యులుగా స్థానం కల్పించడం... ఎంతో మందికి యువకులకు ప్రేరణగా నిలిచిన కారణంగా టీఆర్ఎస్ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం.. తరువాత మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించారు. కానీ ఆ పార్టీ అధినేతకు ఇవేవీ తృప్తిని కలిగించలేదు కాబోలు కష్టానికి తగ్గ ప్రతిఫలం ఇవ్వాలని భావించారేమో? ఏకంగా శాసనమండలికి విప్ బాధ్యతలు సైతం అప్పగించి నిర్ణయం తీసుకోవడం పట్ల శంభీపూర్ రాజు కృతజ్ఞుడైతే.. ఆయన అభిమానులు ఆనందానికి మాత్రం అవధుల్లేవనే చెప్పాలి.



సీఎం కేసీఆర్ అడుగులో అడుగు వేస్తున్న శంభీపూర్ రాజు

‘అన్వేషణ’లో సత్తాచాటిన ఎంఎల్‌ఆర్ఐటీ విద్యార్థులు



ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఎల్‌ఆర్ఐటీ కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి

దుండిగల్: అన్వేషణ–2023లో దుండిగల్‌కు చెందిన మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్‌ఆర్ఐటీ) కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగిన దక్షిణ భారత దేశ స్థాయి అన్వేషణ–2023లో ఎంఎల్‌ఆర్ఐటీకి చెందిన బీటెక్ ఈసీఈ విభాగం విద్యార్థులు మొహమ్మద్ ఖాదర్ పాషా, కోమటి సతీష్ దుండిగల్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన అయేషా(8వ తరగతి), శివానీ (9వ తరగతి) విద్యార్థులతో కలిసి రూపొందించిన బ్రెయిన్ కంట్రోల్ వీల్ చైర్‌కు ప్రథమ బహుమతి లభించింది. వీరు రూ.30 వేల నగదు పురస్కారంతో పాటు ప్రశంస పత్రం అందుకున్నారు.

- అదే విధంగా ఈసీఈ విభాగానికి చెందిన కళ్యాణ్‌రెడ్డి, విశ్వతేజ, వంశీ దుండిగల్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు వర్షిత, వైష్ణవిలతో కలిసి క్రాప్ డ్రైయర్‌ను రూపొందించగా కన్సలేషన్ బహుమతి కింద రూ.5వేల నగదు, ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఆదివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ రావులు విద్యార్థులను అభినందించారు.
- ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమ కళాశాలలో ప్రవేశం పొందిన ప్రతీ విద్యార్థికి నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు వారు వినూత్న ఆలోచనలకు సృజనాత్మకత జోడించి నూతన ఆవిష్కరణలు చేసే విధంగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అన్వేషణ–2023లో తమ విద్యార్థులు విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించడానికి ఇది ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌వీఎస్ ప్రసాద్, కో.ఆర్డినేటర్ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయం



బాల్‌రెడ్డినగర్‌లో కరపత్రాలు పంచుతున్న టీపీసీసీ ప్రతినిధి హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా ఆదివారం ఎన్టీఆర్‌నగర్, బాల్‌రెడ్డినగర్, సూర్యనగర్, గణేష్‌నగర్‌లలో పార్టీ జెండాలను ఎగురవేసిన హన్మంతరెడ్డి ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలతో ప్రజలను మోసం చేశాయన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ నిరంకుశ పాలన కొనసాగిస్తున్నాడని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల పేరుతో కమీషన్లు దండుకోవడమే పనిగా బీఆర్ఎస్ మంత్రులు పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మద్దతు తెలిపి అధికారంలోకి వచ్చేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, నాయకులు జేమ్స్, సంజీవరెడ్డి, ఆనంద్‌రావు, జాకీర్, జెస్సీ పాల్, ఆగమయ్య, సిద్దయ్య, ఈశ్వర్, సంగమ్మ, బాలరాజు, వనజ, సాయి తదితరులు పాల్గొన్నారు.

‘మీ దిక్కున్న చోట చెప్పుకోండి..’

కుత్బుల్లాపూర్: అయినవారికి ఆకుల్లో..! కాని వారికి కంచాల్లో అన్నట్లుగా జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్ఐ వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తుంది. నో ఎంట్రీ సమయంలో మామూలు ఇచ్చే వాహనదారులను వదిలి ఇతర వాహనదారులపై తన ప్రతాపాన్ని చూపిస్తూ ప్రశ్నిస్తే ‘మీ దిక్కున చోట చెప్పుకోండి..’ అంటూ బెదిరింపులకు దిగడం పరిపాటిగా మారింది. ప్రతిరోజు గాజులరామారం, కైసర్‌నగర్, బౌరంపేట్, ప్రగతినగర్ కమాన్ తదితర ప్రాంతాల్లో ఆకస్మికంగా తనిఖీల పేరిట వాహనాలు ఆపి నో ఎంట్రీ పేరుతో అందిన కాడికి దండుకుంటున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రతిరోజు పై ప్రాంతంలో ఎక్కడో ఒకచోట తనిఖీల పేరిట హల్‌చల్ చేస్తుండటంతో ఇటీవల కొంతమంది వాహనదారులు నెలవారి మామూలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే నో ఎంట్రీ సమయంలో కొన్ని వాహనాలను వదులుతూ మరికొన్ని వాహనాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా ఎవరైనా ఆ ఎస్ఐని ప్రశ్నిస్తే సీపీకి ఫిర్యాదు చేసుకోండి..! ఎవరు చెప్పినా వినను.! అంటూ బెదిరింపు ధోరణిలో సమాధానం ఇస్తున్నాడని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఇదే విషయాన్ని జీడిమెట్ల సీఐ చంద్రశేఖర్‌ను ‘సాక్షి’వివరణ కోరగా తప్పకుండా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కార్మికుల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తున్నాం



టీఆర్ఎస్ నాయకుడు ప్రతాప్‌ను సత్కరిస్తున్న ఆల్‌మెలో కంపెనీ కార్మికులు

రంగారెడ్డినగర్: కార్మికుల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తున్నానని టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఆల్‌మెలో ప్రైవేట్ లిమిటెడ్ యూనియన్ అధ్యక్షుడు కేఎం ప్రతాప్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ పారిశ్రామికవాడలోని ఆల్‌మెలో ప్రైవేట్ లిమిటెట్ కంపెనీలో కార్మికుల వేతన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతాప్ మాట్లాడుతూ... నూతన వేతన ఒప్పందంతో ప్రతి కార్మికుడికి రూ.35వేల నుంచి 40వేల వరకు నెలసరి జీతం వస్తుందన్నారు. కార్మికుల పిల్లలకు చదవుల్లో 85 శాతం కంటే ఎక్కువ మెరిట్ మార్కులు వస్తే స్కాలర్‌షిప్‌లు, రిటైర్‌మెంట్ గిఫ్ట్, బెనిఫిట్‌లకు అదనంగా రూ.లక్ష ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేసిన ప్రతాప్‌ను ఈ సందర్భంగా కార్మికులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేపీ విశాల్‌గౌడ్, పరిశ్రమ ప్రధాన కార్యదర్శి శాంతారావు,ఉపాధ్యక్షులు రాంచందర్, శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి మల్లికార్జున్, కోశాధికారి జయన్న, కార్యనిర్వాహణ కార్యదర్శి సురేష్, కంపెనీ యూనియన్ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

దుండిగల్: తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిమైసమ్మ పరిధిలోని 120 యార్డ్స్ ప్రాంతానికి చెందిన వీరపాండు (34), సువర్ణలు భార్యాభర్తలు. కాగా కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. వీరపాండు తల్లి ఉమారాణి సైతం తన కుమార్తె వసుంధరతో రెండు నెలలుగా ఉంటోంది. ఈ నేపథ్యంలో తాగుడుకు బానిసైన వీరపాండు భార్య వదిలి వెళ్లిపోయిందన్న మనస్తాపంతో ఈ నెల 19వ తేదీ ఉదయం 9గంటలకు ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు అతన్ని కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

జగద్గిరిగుట్ట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట లెనిన్‌నగర్‌కు చెందిన అంజుకుమారి (20) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. కాగా ఈనెల 18న ఉదయం 11గంటలకు ఈవెంట్‌లోని మెకప్ వేయడానికి వెళ్తున్నానని కుటుంబసభ్యులకు చెప్పి వెళ్లిన యువతి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు కళాశాల, స్నేహితుల ఇళ్లల్లో వాకబు చేసినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో యువతి అక్క సంజుకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి


కుత్బుల్లాపూర్: వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన సెక్యూరిటీ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లిలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న అస్సాం రాష్ట్రానికి చెందిన దులాల్ సైకియా(43) ఈనెల 18వ తేదీ రాత్రి 11గంటలకు డ్యూటీ ముగించుకుని కండ్లకోయలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు దాటుతుండగా మేడ్చల్ నుంచి వేగంగా వచ్చిన కారు (టీఎస్09ఈపీ 9747) ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన దులాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్

జై శివాజీ

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ముస్లిం దండయాత్రల నుంచి హైందవ మతాన్ని పరిరక్షించిన మహనీయుడు ఛత్రపతి అని పలువురు వక్తలు కొనియాడారు. – కుత్బుల్లాపూర్



బాలయ్యనగర్ కమాన్ వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహ స్థాపనకు భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్



ఛత్రపతి శివాజీ జయంతి ఉత్సవాల్లో బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి



దీపోచంపల్లిలో దుండిగల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో..

వైభవంగా మల్లికార్జునస్వామి జాతర



మల్లికార్జునస్వామిని దర్శించుకున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి



మల్లికార్జునస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల గ్రామంలోని మల్లికార్జున స్వామి జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు స్వామివారి కల్యాణం, మధ్యాహ్నం 2గంటలకు అగ్ని గుండాలు, బోనాలు సమర్పణ, తదనంతరం గొర్రెపోతుల బండి ఊరేగింపు, గొలుసులు తెంపుట తదితర కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా ఉపవాస దీక్ష విరమించిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. స్వామి వారిని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ఉమామహేశ్వరాలయంలో సాంస్కృతిక ప్రదర్శనలు

సుభాష్‌నగర్: సూరారంలోని ఉమామహేశ్వర ఆలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించిన కళాకారులను ఆదివారం ఆలయ ధర్మకర్త ముద్దాపురం మదన్‌గౌడ్ జ్ఞాపికలతో సత్కరించారు. అదే విధంగా ఉపవాస దీక్ష విరమించిన భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఉమామహేశ్వరుడు అర్ధనారీశ్వర అవతారంలో భక్తులకు దర్శనమిచ్చాడు.

- మార్కండేయ ఆలయంలో అన్నదానం

జగద్గిరిగుట్ట: మహా శివరాత్రి సందర్భంగా ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులకు ఆదివారం జగద్గిరిగుట్ట పరిధిలోని మార్కండేయ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మునిపల్లి జనార్ధన్, జైహింద్, రాజు, రాము, జయరాములు, శేషారెడ్డి, విఠల్ ముదిరాజ్, అంజిరెడ్డి తదితరుల పాల్గొన్నారు.

